క్లుప్తంగా

సర్వజన ఆస్పత్రి ఆర్‌ఎంఓగా రామచంద్రరావు



మచిలీపట్నంటౌన్: జిల్లా సర్వజన ఆస్పత్రి రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్ (ఆర్ఎంఓ) గా డాక్టర్ కోలా రామ చంద్రరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఆర్ఎంఓగా పనిచేస్తున్న కృష్ణదొర గుడివాడకు బదిలీపై వెళ్లడంతో రామచంద్రరావు ఈయన స్థానంలో ఆర్ఎంఓగా బాధ్యతలు స్వీకరించారు. ఆర్ఎంఓగా బాధ్యతలు స్వీకరించిన రామచంద్రరావును ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది అభినందించారు. ఆస్పత్రి పూర్వ సూపరింటెండెంట్ జయకుమార్, ఈఎన్‌టీ డాక్టర్ దేసు సత్యనారాయణ, వైద్యులు మోతీలాల్, హ్యాపీలు పలు ప్రాంతాలకు బదిలీ కావడంతో మంగళవారం రిలీవ్ అయ్యారు. వీరి స్థానంలో జిల్లా మెడికల్ అండ్ హెల్త్ విభాగంలో ఉన్న వైద్యులను ఇక్కడ నియమించాల్సి ఉంది.

భీష్మ ఏకాదశి పూజలు

బంటుమిల్లి: మండలంలోని వైష్ణవాలయాల్లో బుధవారం భీష్మ ఏకాదశి సందర్భంగా విశేష పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక పద్మావతి, గోదా సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో పండితులు పవన్, సాయిలు ఉత్సవ మూర్తులకు పూజలు చేశారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్, ఆర్యవైశ్య మహిళా సంఘ సభ్యులు ఏకాదశ విష్ణు సహస్రనామ పారాయణ, వేంకటేశ్వర గానామృతం పఠించారు. అర్తమూరు, చోరంపూడి తదితర గ్రామాల్లోని రామాలయాల్లో భీష్మ ఏకాదశి పూజలు వైభవంగా జరిగాయి. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దుకాణాలు తనిఖీ

పెడన: పాలిథిన్ కవర్లు వాడవద్దని, వాటిని వాడటం వల్ల అనారోగ్యానికి గురికావాల్సి వస్తోందని శానిటేషన్ ఇన్‌చార్జి ఎస్‌ఐ బి. రమ్య అన్నారు. బుధవారం ఆమె సచివాలయాల శానిటేషన్ కార్యదర్శులతో పట్టణంలోని పచారీ, మాంసం, చేపలు, పండ్ల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లపై నిషేధం ఉందని, ఆయా దుకాణాల యజమానులు నిబంధనలు పాటించాలని చెప్పారు.

ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

అవనిగడ్డ: ఘంటసాల మండలం పాపవినాశనానికి చెందిన డొక్కు ధనలక్ష్మి మృతిచెందింది. ఆమె భర్త సాంబశివరావుకి రెండు రోజుల్లోనే పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పీఎల్ఐ) క్లెయిమ్ ఒక లక్ష రూపాయల చెక్కును పోస్టుమాస్టర్ సింహాద్రి రామలింగేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 140 సంవత్సరాల క్రితం ప్రారంభమైన పీఎల్ఐ వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘంటసాల ఏఎంసీ చైర్మన్‌గా వేమూరి బాధ్యతల స్వీకారం



వేమూరిని అభినందిస్తున్న జెడ్పీటీసీ తుమ్మల

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల ఏఎంసీ చైర్మన్‌గా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వేమూరి వెంకట్రావు బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఘంటసాల మండల పరిధిలోని కొడాలి మార్కెట్ యార్డు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వేమూరితో పాటు పలువురు పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్ వేమూరి వెంకట్రావు మాట్లాడుతూ ఏఎంసీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. రైతులకు ఉపయోగపడేలా డొంకరోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎంసీ చైర్మన్ వెంకట్రావును జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ అభినందించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

మచిలీపట్నంటౌన్: భారత జాతీయ కళా, సాంస్కృతిక పరిరక్షణ సంస్థ (ఇంటాక్) మచిలీపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో బుధవారం చిలకలపూడి పాండురంగ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 70 మంది విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిత్రలేఖనంలో ప్రతిభ చూపిన 23 మంది విద్యార్థులకు సంస్థ కన్వీనర్ డాక్టర్ ఉడత్తు శ్రీనివాసరావు ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకశక్తిని పెంపొందించేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించామన్నారు. ప్రధానోపాధ్యాయిని కనకదుర్గ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మచిలీపట్నంటౌన్: చిలకలపూడి విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ ఎం. భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిలకలపూడి, దిమ్మలసెంటర్, కొత్తపేట, లక్ష్మణరావుపురం, ఎన్‌జీఓ కాలనీ, విశ్వబ్రాహ్మణ కాలనీ, సర్కారుతోట, కొబ్బరితోట, సీఎస్ఆర్ నగర్, గాంధీనగర్, బ్రహ్మపురం, పరాసుపేట, నరసింహనగర్, బచ్చుపేట, నాయర్‌బడ్డీ సెంటర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

అన్ని వర్గాలకు జగన్ ప్రభుత్వం అండ

- మంత్రి జోగి రమేష్
- మహాయజ్ఞంలా పింఛన్ల పంపిణీ



పెడన 22వ వార్డులో పింఛను నగదు అందిస్తున్న మంత్రి జోగి రమేష్

పెడన: కుల,మతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తూ అన్నివర్గాలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయాల సమన్వయకర్తలతో కలిసి బుధవారం వేకువ జామున పెడన పట్టణంలోని 22వ వార్డులో సామాజిక పింఛన్లు మంత్రి పంపిణీ చేశారు. వృద్ధులను క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. పలువురు వృద్ధులు, పెన్షన్ లబ్ధిదారులు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వంలోనూ తమకు పింఛన్లు ఇలా ఇంటికి వచ్చి ఇవ్వలేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చల్లగా ఉండాలని, మళ్లీమళ్లీ ఆయనే రావాలని ఆశీర్వదించారు. ఒక విద్యార్థిని ఏం చదువుతున్నావంటూ మంత్రి రమేష్ ప్రశ్నించడంతో 8వ తరగతి చదువుతున్నానని చెప్పగా ట్యాబ్ ఇచ్చారా..వాడుతున్నావా..తీసుకురా అని చెప్పగానే సదరు విద్యార్థిని ట్యాబ్ తీసుకువచ్చి ఆన్‌చేసి చూపించి లెక్కలు చేసుకుంటున్నాని పేర్కొనగా బాగా చదవి కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని మంత్రి ఆశీర్వదించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి, వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బండారు మల్లికార్జునరావు, కౌన్సిలర్లు బళ్ల గంగయ్య, మెట్ల సుబ్రహ్మణ్యం, పిచ్చిక సతీష్‌బాబు, ఉమ్మిటి తనూజ, బళ్ల పద్మావతి పాల్గొన్నారు.

- పెడన మండలం చెన్నూరు గ్రామంలో మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్, ఎంపీపీ రాజులపాటి వాణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు పెన్షన్లు పంపిణీ చేశారు. నడుపూరులో సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు.
- **బంటుమిల్లి:** వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, వార్డు సభ్యులతో కలిసి గృహ సారథులు మండలంలో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. నాగేశ్వరరావుపేట పంచాయతీ పరిధిలోని జానకీరామపురం, లక్ష్మీనారాయణపురం గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో పంచాయతీ ఇన్‌చార్జి యెనుముల కొండ, గ్రామ కన్వీనర్లు వెంకటేశ్వరరావు, మారుతి, వార్డు సభ్యులు జి. శ్రీనివాసరావు, టి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనారాయణపురం గ్రామంలో పింఛన్ అందజేస్తున్న గృహ సారథులు



గూడూరులో పింఛన్ అందజేస్తున్న మధుసూదనరావు

బందరులో 92.71 శాతం పింఛన్ల పంపిణ

మచిలీపట్నంటౌన్: పింఛన్ల పంపిణీలో నగరం జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచింది. నగరంలో మొత్తం 18,775 మంది పింఛనుదారులు ఉండగా వీరిలో 17,407 మందికి పింఛన్లు అందజేసి 92.71 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశారు. ఇంకా 1,368 మందికి పింఛను సొమ్మును అందజేయాల్సి ఉంది. తెల్లవారుజామున నగరంలోని ఆయా డివిజన్ల కార్పొరేటర్లతో పాటు డివిజన్ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో కలిసి వెళ్లి లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేశారు. తెల్లవారుజాము నుంచి కార్పొరేటర్లు, కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జీలు, గృహ సారథులు వారి పరిధిలోని వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేశారు.

పొద్దు పొడవక ముందే పంపిణీ

కృత్తివెన్ను: సామాజిక ఫించన్ల పంపిణీ కార్యక్రమం మండలంలో వేకువజాము నాలుగు గంటలకు ముందే ప్రారంభమైంది. వలంటీర్‌లు, గృహ సారథులు కలిసి ప్రతి పింఛన్‌దారుని ఇంటికి వెళ్లి తలుపుతట్టి మరీ పింఛన్‌ను అందజేశారు. మండల వ్యాప్తంగా 7,075 మందికి పింఛన్లు అందించాల్సి ఉండగా బుధవారం సాయంత్రానికి 6,370 మందికి అంటే 90 శాతానికి పైగా పంపిణీ చేశారని ఎంపీడీఓ పిచ్చిబాబు తెలిపారు.

86 శాతం పెన్షన్ల పంపిణీ

గూడూరు: ఫిబ్రవరి నెలకు సంబంధించి గూడూరు మండలంలో మొదటి రోజు 86 శాతం పెన్షన్ల పంపిణీ జరిగింది. తెల్లవారుజాము నుంచే గ్రామ వలంటీర్లు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేశారు. ఎంపీపీ మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు సురేష్ రంగబాబు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పీఏసీఎస్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మండలంలో 86 శాతం పెన్షన్లు పంపిణీ చేశారని ఎంపీడీఓ డి. సుబ్బారావు తెలిపారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



మహిళకు బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

నాగాయితిప్ప(మోపిదేవి): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా ప్రతిఒక్కరికీ పథకాలు అందిస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. నాగాయితిప్పలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకుడు కడవకొల్లు నరసింహారావుతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి బ్రోచర్లు అందజేశారు. మొత్తం 202 గృహాలను సందర్శించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పింఛన్ కోసం ఎప్పుడు ఇస్తారా అని ఎదురు చూసే వారని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటి తలుపు తట్టి మరీ వలంటీర్లు పింఛన్లు అందిస్తున్నారని వివరించారు. మండల పరిధిలో మొత్తం 6,059 మందికి రూ. ఒక కోటి.59 లక్షలకు పైగా పింఛన్లు ప్రతి నెలా అందిస్తున్నామని వివరించారు. ప్రస్తుతం మంచు ఎక్కువగా ఉన్నందున కుప్పల్లోని ధాన్యం రంగు మారుతోందని, అయినా ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని చెప్పారు. ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తోందని, మరో 30 ఏళ్లు ముఖ్యమంత్రిగా జగనన్నే ఉండాలని ప్రజలు దీవిస్తున్నారని తెలిపారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విలేజ్ క్లినిక్‌లో ఎమ్మెల్యే బీపీ చెక్ చేయించుకున్నారు. సర్పంచ్‌లు గరికిపాటి వెంకటేశ్వరరావు, మోర్ల జ్యోత్స్న, ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్ బాబు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గరికిపాటి గోవిందరాజులు, పాల కేంద్రం అధ్యక్షుడు పుప్పాల సతీష్ బాబు, లింగం జగదీష్‌కుమార్, మోర్ల శ్రీనివాసరావు, రాజులపాటి నాగేశ్వరరావు, పలుశాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల రక్తదానం



మచిలీపట్నంటౌన్: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పట్టాభి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ వైద్య సిబ్బంది రక్తాన్ని స్వీకరించారు. జిల్లా ప్రజా రవాణాధికారి నాగేశ్వరరావు, ఆర్టీసీ మెడికల్ ఆఫీసర్ విజయసింగ్ శిబిరాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రాణాపాయస్థితిలో ఉన్న రోగులకు రక్తాన్ని దానం చేసేందుకు ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆర్టీసీకి చెందిన డ్రైవర్లు, కండక్టర్లు సుమారు 100 మంది రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ టి. పెద్దిరాజు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు శివప్రసాద్, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

195 మందికి నేత్ర వైద్య పరీక్షలు



నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

బంటుమిల్లి: ఓఎన్జీసీ రాజమండ్రి ఎస్సెట్, అనుగ్రహ దృష్టిదాన్ స్వచ్ఛంద సంస్థ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో బుధవారం బంటుమిల్లిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి వైద్యులు శిబిరంలో పాల్గొన్న 195 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 34 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ఓఎన్జీసీ కృష్ణా జిల్లా ఇన్‌చార్జి జిల్లేపల్లి ప్రసాద్ మాట్లాడుతూ ఆపరేషన్లు అవసరమైన వారికి సంస్థ సౌజన్యంతో ఉచితంగా ఆపరేషన్లు చేసి కళ్లజోళ్లు ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో దృష్టి దాన్ సంస్థ చీఫ్ కో-ఆర్డినేటర్ సంజయ్ ఔట్‌వాల్, ఓఎన్జీసీ వైద్యాధికారి శ్యాం, పంచాయతీ ప్రత్యేక ఆహ్వానితులు సుజ్ఞానం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కేడీసీసీబీ సేవలపై కళాజాతా ప్రదర్శన

గూడూరు: కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ రైతులకు విస్తృత సేవలు అందిస్తోందని కేడీసీసీ బ్యాంక్ గూడూరు మేనేజర్ ఫణికుమార్ అన్నారు. కేడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో రైతులకు అందిస్తున్న సేవలపై గూడూరు మండలం మల్లవోలు గ్రామంలో బుధవారం కళాజాతా బృందం ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు. బిల్లపాడుకు చెందిన కళా భారతి బృంద కళాకారులు ప్రచార రథంతో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా, సురక్షా బీమా యోజన, నగదు రహిత లావాదేవీలు, సైబర్ నేరాలకు సంబంధించి ప్రజలను చైతన్యం చేశారు. కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో రైతులకు అందిస్తున్న పథకాలను పాటలు, వీధి నాటకాల ద్వారా వివరించారు. కార్యక్రమంలో మల్లవోలు పీఏసీఎస్ చైర్మన్ దాసరి రమేష్, సూపర్‌వైజర్ శివనాగరాజు, తుమ్మల గణేష్, రైతులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభతో పులకించిన హంసలదీవి



వ్రతాల్లో పాల్గొన్న దంపతులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి దంపతులు

కోడూరు: హంసలదీవి గ్రామం ఆధ్యాత్మిక శోభతో పులకించింది. భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని విశ్వశాంతి యాగ మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రమా సహిత సత్యదేవుని వ్రతాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. టీటీడీ వేద పాఠశాలకు చెందిన పండితుల మంత్రవచనాల నడుమ జరిగిన సత్యదేవుని వ్రతాలల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 600 మంది దంపతులు పాల్గొన్నారు. టీటీడీ వేద పాఠశాల ప్రిన్సిపాల్ కుప్పా సుబ్రహ్మణ్య అవధాని సత్యదేవునికి సంబంధించిన ఐదు కథలను భక్తులకు వివరించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు-కెప్టెన్ లక్ష్మీ దంపతులు వ్రతాల్లో పాల్గొన్నారు. కమిటీ చైర్మన్ మోపిదేవి చక్రవర్తి ఎమ్మెల్యే దంపతులను దుశ్శాలువాలతో సత్కరించారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో కమిటీ ఆధ్వర్యంలో సుమారు ఐదు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు.

వేణుగోపాలుడికి ప్రత్యేక పూజలు..

వేణుగోపాలస్వామి వారికి ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 3 నుంచి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల వివరాలను ఆలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈఓ సుధాకర్ ఎమ్మెల్యే దంపతులను సత్కరించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బేస్ బాల్ పోటీలకు సాలెంపాలెం విద్యార్థి



కోడూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బేస్‌బాల్ పోటీల్లో సాలెంపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థి ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జనవరి 28 నుంచి 30 వరకు కాకినాడలోని పీఆర్ డిగ్రీ కళాశాలలో ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్-14 విభాగంలో బేస్‌బాల్ పోటీల్లో పాఠశాలకు చెందిన కొప్పనాతి చంద్రశేఖర్ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని హెచ్ఎం మీర్జా ఆలీరాజా తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థితో పాటు శిక్షణ ఇచ్చిన పీడీ గాజుల లక్ష్మీప్రసాద్‌ను జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, పీఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ సముద్రాలు, ఎంపీటీసీ లంకే భాస్కరరావు అభినందించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి గ్రామోత్సవం



చల్లపల్లి: వీరబ్రహ్మేంద్ర స్వామి గ్రామోత్సవం ఘనంగా జరిగింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో వార్షిక కల్యాణ మహోత్సవాల సందర్భంగా బుధవారం గ్రామోత్సవం నిర్వహించారు. కల్యాణ మూర్తులైన వీరబ్రహ్మేంద్రస్వామి-గోవిందమాంబల ఉత్సవ మూర్తులను ఉత్సవ రథంపై ఏర్పాటు చేసి వేద పండితులు గ్రామోత్సవం చేపట్టారు. చల్లపల్లి మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్వామివారు వీధుల్లో దర్శనమిచ్చారు. కమిటీ అధ్యక్షుడు శామీరుపేట సాయిబాబు, ప్రధాన కార్యదర్శి నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, కేశనకుర్తి శరత్‌బాబు, అడ్డాడ ప్రసాద్ బాబు, డోలా శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

మత్స్యకారుల అభ్యున్నతికి పెద్దపీట

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



గంగపుత్రులకు మోపెడ్‌లు, ఐస్‌బాక్సులు అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

కోడూరు: మత్స్యకారుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం కోడూరు పంచాయతీ కార్యాలయం వద్ద గంగపుత్రులకు సబ్సిడీపై టీవీఎస్ మోపెడ్‌లు, ఐస్‌బాక్స్‌లను పంపిణీ చేశారు. ఫిషరీస్ జేడీ ఎన్.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో రమేష్ బాబు మాట్లాడారు. దేశవ్యాప్తంగా 75 శాతానికి పైగా చేపల ఉత్పత్తి ఏపీ నుంచే సాగుతోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపల మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. గ్రామ స్థాయిలో మత్స్యసంపద విక్రయించేలా ఫిష్ ఆంధ్రా డైరీ, ఫిష్ ఆంధ్రా సూపర్ అవుట్‌లెట్‌లు సబ్సిడీపై ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని చెప్పారు. డోమెస్టిక్ ఫిష్ మార్కెట్ పేరుతో మత్స్య సంపదను ఇతర ప్రాంతాలకు విక్రయించేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నారు. ఆక్వా హబ్‌ను బలోపేతం చేసేందుకు రైతులకు సబ్సిడీపై విద్యుత్‌ను అందించడంతో పాటు మొబైల్ వాహనం ద్వారా ఆక్వా సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వేట నిషేధ సమయంలో కూడా మత్స్యకారులకు భృతిని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని వివరించారు.

గంగపుత్రులకు మోపెడ్‌లు అందజేత

ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద మండలంలోని 13 మంది గంగపుత్రులకు సబ్సిడీపై టీవీఎస్ మోపెడ్‌లు, ఐస్‌బాక్స్‌లను రమేష్‌బాబు అందించారు. యూనిట్ ధర రూ.75 వేలు కాగా ఇందులో 24 శాతం సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం, 16 శాతం సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. లబ్ధిదారుడి నుంచి 40 శాతం వాటా మాత్రమే తీసుకొని వాహనాలను అందించామని జేడీ శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడ సెంట్రల్ పార్టీ పరిశీలకుడు కడవకొల్లు నరసింహారావు, మత్స్యశాఖ ఏడీ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎఫ్‌డీఓ వి.సత్యనారాయణ, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వీరవెంకటకుమారి, సర్పంచి వెన్నా షైనీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీర వెంకటనారాయణరావు, ఉప సర్పంచి ఇంకొల్లు మురళి, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి



ఏఎంసీ చైర్మన్ వీర వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

నాగాయలంక: నూతన పాలకవర్గం రైతులకు మెరుగైన సేవలు అందించి పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక దివి మార్కెట్ యార్డు కార్యాలయంలో బుధవారం రాత్రి నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ దివి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి తొలిసారిగా ఎస్సీలకు ఇవ్వడం చారిత్రాత్మకమన్నారు. ఎన్ని పార్టీలు కలిసొచ్చినా, ఎన్ని కుట్రలు చేసినా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ పరిశె ఏసయ్యతో పాటు నూతన పాలకవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఏఎంసీ చైర్మన్ వీర వెంకటేశ్వరరావు అవనిగడ్డ నుంచి భారీ ఊరేగింపుగా తరలివచ్చారు. వైఎస్సార్ సీపీ మండల పార్టీ కన్వీనర్ భోగాది శేషగిరిరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకుడు కడవకొల్లు నరసింహారావు, లిడ్‌క్యాప్ చైర్మన్ కాకుమాని రాజశేఖర్, ఏఎంసీ మాజీ చైర్మన్ రేమాల బెనర్జీ, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ నలుకుర్తి రమేష్, ఏఎంసీ సెక్రటరీ కె. ఆనంద్, అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మండల పార్టీ కన్వీనర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన ఉల్లిపాలెం



ఆలయం చుట్టూ కలశాలను ఊరేగిస్తున్న పండితులు, అష్టాక్షరీ స్వామీజీ

కోడూరు: అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెం గ్రామం బుధవారం భక్తులతో పోటెత్తింది. భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామి వారి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామీజీ పర్యవేక్షణలో ఉదయం స్వామి వారి ఉత్సవమూర్తులకు తిరుమంజన సేవ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పల్లకీలో స్వామివార్లను ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 20 మంది పండితుల మంత్రవచనాల నడుమ 108 కలశాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాటిని ఆలయం చుట్టూ ఊరేగించి గర్భాలయంలోని 11 అడుగుల శ్రీమన్నారాయణుడి విగ్రహానికి అభిషేకాలు చేశారు. వివిధ నదుల నుంచి తీసుకువచ్చిన జలాలతో స్వామి వారిని అభిషేకించారు.

55 భక్త మండళ్ల సభ్యులతో పారాయణం..

రాష్ట్ర గోదా విష్ణు సహస్ర నామ పరివార్ ఆధ్వర్యంలో ఆలయంలో స్వామి వారి పారాయణ ఏకాహాన్ని ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల్లోని 18 జిల్లాలకు చెందిన 55 భక్తమండళ్ల సభ్యులు పారాయణ ఏకాహం నిర్వహించేందుకు తరలివచ్చారు. స్వామివారి చిత్రపటాన్ని నెలకొల్పి తులసీ దళాలతో మహిళలు పూజలు చేశారు. రాత్రికి స్వామి వార్ల నగరోత్సవం కనుల పండువగా నిర్వహించారు. గురువారం ఉదయం 10 గంటల వరకు ఏకాహం కొనసాగుతుందని పరివార్ రాష్ట్ర అధ్యక్షుడు మారం నాగరాజగుప్తా తెలిపారు.

ఏప్రిల్ 25 నుంచి మహా కుంభాభిషేక మహోత్సవాలు



మాట్లాడుతున్న అష్టాక్షరి స్వామీజీ

కోడూరు: ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నాయణస్వామి వారి ఆలయంలో ఏప్రిల్ 25వ తేదీ నుంచి మహాకుంభాభిషేక మహోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ నిర్మాణకర్త త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామిజీ తెలిపారు. బుధవారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీమన్నారాయణుడి ఆలయ నిర్మించి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏప్రిల్ 25 నుంచి మే 5వ తేదీ వరకు 12 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన 90 మంది రుత్విकుల మంత్రవచనాల నడుమ హోమాలు, యాగ క్రతువులు జరుగుతాయన్నారు. మహా కుంభాభిషేక మహోత్సవాలను ఈ ప్రాంతంలో నిర్వహించడం ఇదే తొలిసారని, ఇందు కోసం ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. మార్చి 5వ తేదీ నుంచి కుంభాభిషేకోత్సవాల గురించి గ్రామ గ్రామాన ప్రచారం నిర్వహిస్తామన్నారు. మే 5వ తేదీన కుంభాభిషేకం జరిపి, అదే రోజు లక్ష మందికి మహా అన్నసమారాధనను నిర్వహిస్తామని వివరించారు. కమిటీ సభ్యులు బూరగడ్డ హరినాథ్‌బాబు, మద్దాలి ప్రసాద్, జూపూడి సుభాష్‌చంద్రబోస్, అన్నం యోగానంద్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

బంటుమిల్లి: పెందుర్రు గ్రామంలో కోడి వందేలు, పేకాట శిబిరంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. కోడి వందేలు, పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 3,220 నగదు, కోడి పుంజు, కత్తిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

చోరీ కేసులో ముద్దాయికి ఆరు నెలల జైలు

కృత్తివెన్ను మండలం సీతనపల్లి గ్రామానికి చెందిన లేళ్ల రంగారావుకు బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి ఈ. సుధాకర్ 6 నెలల జైలు, రూ. 500 జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు ఇచ్చారు. ఎస్‌ఐ ఎ. పైడిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చోరంపూడి గ్రామానికి చెందిన మోకా శ్రీనివాసరావు ఇంట్లో రంగారావు 2019 సంవత్సరంలో దొంగతనానికి పాల్పడ్డాడు. ఈ సందర్భంగా నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయి రంగారావుకు న్యాయమూర్తి పై విధంగా శిక్ష విధించారు.